క్లుప్తంగా

8న జాతీయ లోక్ అదాలత్

పుత్తూరు: పుత్తూరు సబ్ కోర్టు ఆవరణలో మార్చి 8వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు ఎస్‌సీ.రాఘవేంద్ర శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని రకాల సివిల్ కేసులు, వివాహ సంబంధ మనోవర్తి, చెక్కు బౌన్స్ కేసులు, రాజీ చేసుకోదగ్గ క్రిమినల్ కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. అలాగే ప్రీ లిటిగేషన్ కేసులు (కోర్టులో పెండింగ్‌లో లేని కేసులు)సైతం రాజీ చేస్తామని, లోక్ అదాలత్‌లో తీర్పు అంతిమ తీర్పు అని, దీనిపై అప్పీలుకు వెళ్లడానికి అవకాశమే లేదని స్పష్టం చేశారు. కక్షిదారులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి


ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ

కార్వేటినగరం: ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలను పాటించాలని నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ అన్నారు. రోడ్డు నిబంధనలపై శుక్రవారం స్థానిక సీఐ కార్యాలయ ఆవరణలో ఆటో డ్రైవర్లకు డీఎస్పీ అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్లు మద్యం సేవించి ఆటోలు నడిపినా, లైసెన్సులు లేకుండా నడిపినా జరిమానా తప్పవని హెచ్చరించారు. సీఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజ్‌కుమార్, పోలీసులు పాల్గొన్నారు.

టీబీ అలర్ట్ హెల్త్ క్యాంప్


శిబిరంలో మాట్లాడుతున్న వైద్యాధికారి

నగరి: మండలంలో సత్రవాడ, కరకంతాపురం గ్రామాల్లో వేల్ మురుగన్ స్టోన్ క్రషర్స్ సహకారంతో బ్రీత్ సేఫ్ 360 టీబీ అలర్ట్ ఇండియా శుక్రవారం టీబీ అలర్ట్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. 35 మందికి టీబీ, బీపీ, మధుమేహం, రక్త పరీక్షలు ఇతర ఆరోగ్య సమస్యలపై స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. తరచూ దగ్గు, జ్వరం రావటం, బరువు దగ్గడం, గళ్ళలో రక్తం పడటం..తదితర లక్షణాలు ఉంటే వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని వైద్యాధికారి ఎయిళరసన్ తెలియజేశారు. వేల్‌మురుగన్ స్టోన్ క్రషర్స్ ఎండీ సతీష్, వైద్య సిబ్బంది జగదీష్, శ్రీనివాస్, పవన్, కుమారి, ప్రేమ లత, కళ్యాణి, కుమార్ నదియా, లక్ష్మి, ఉష, ఉషారాణి, నీరజ , ప్రియాంక, మీనా, ఆవా కార్యకర్తలు వైద్య సిబ్బంది పాల్గున్నారు.

క్లస్టర్ సమావేశాల సమయం మార్పు చేయండి

కార్వేటినగరం: శనివారం నుంచి నిర్వహించనున్న క్లస్టర్ సమావేశాల సమయాన్ని మార్పు చేయాలని ఎస్టీయూ జిల్లా కార్యదర్శి ఆటుకారు చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కార్వేటినగరంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. క్లస్టర్ సమావేశాలను మధ్యాహ్నం 12.30 నుంచి మొదలు పెట్టడం సరికాదన్నారు. విద్యార్థులకు 11 గంటల నుంచి 45 నిమిషాలకే భోజనం పెట్టి, ఒక గంట సమయంలో తమ క్లస్టర్లకు సుమారు 20 నుంచి 30 కిలో మీటర్ల దూరం నుంచి టీచర్లు వెళ్లడం ఇబ్బందిగా ఉంటుందన్నారు. కనీసం ఉపాధ్యాయులకు సమయానికి భోజనం చేసే అవకాశం కూడాప్రభుత్వం కల్పించక పోవడం శోచనీయమన్నారు.

నేత్ర సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి


కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

కార్వేటినగరం: నేత్ర సంరక్షణకు కూడా విద్యార్థులు ప్రాధాన్యత ఇవ్వాలని సామాజిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్ అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్కే ఎస్సార్ ఉన్నత పాఠశాలలో కత్తెరపల్లె ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలోని దృష్టి సంబంధిత సమస్యలతో బాధ పడుతున్న విద్యార్థులకు హెచ్‌ఎం కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కళ్లద్దాలు పంపిణీ చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ, కంటి చూపు విషయంలో ఏమైనా ఇబ్బందులు పడుతున్న పక్షంలో జాప్యం చేయకుండా నేత్ర వైద్య నిపుణులను విద్యార్థులు సంప్రదించాలని, నిర్లక్ష్యం వహిస్తే భవిష్యత్తు అంధకారమయం అవుతుందని హెచ్చరించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారులు డాక్టర్ భువనేశ్వరి, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'రేషన్' భోజ్యం.. ఇచ్చేది పూజ్యం..!

- వడమాలపేట మండలంలో రేషన్ డీలర్లదే హవా
- ఎక్కడా తిరగని రేషన్ పంపిణీ వాహనాలు
- తూకంలో మోసాలు
- గగ్గోలు పెడుతున్న కార్డుదారులు
- పట్టించుకోని అధికారులు





వడమాలపేట మండలంలో ప్రజా పంపిణీ వ్యవస్థ గాడి తప్పుతోంది. ఇక్కడ రేషన్ డీలర్లదే హవా నడుస్తోంది. రేషన్ పంపిణీ వాహనాలు ఎక్కడా తిరగడం లేదు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇంటి ముంగిటకే రేషన్ సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టింది. ఎండీయూ ఆపరేటర్లతో ఇంటింటికీ వాహనాలతో రేషన్ పంపిణీ చేసింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఎండీయూ ఆపరేటర్ల వ్యవస్థను నిర్వీర్యం చేస్తోంది. ఇదే అవకాశంగా డీలర్లు అరకొర సరకులు ఇస్తూ, పేదల కడుపు కొడుతున్నారు.

31షాపులు, 25వేల మంది జానాభా

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలంలో మొత్తం 22 పంచాయతీల్లో 35 రేషన్ షాపులు ఉన్నాయి. వీటిలో దాదాపు 20 వేల కుటుంబాలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ డీలర్లు వాహనాల్లో ఇంటింటికీ రేషన్ బియ్యం పంపిణీ చేయకుండా చక్రం తిప్పుతున్నారు. తూకాలలో మోసాలకు పాల్పడుతూ 10 కిలోలకు గాను 9 కిలోలు మాత్రమే బియ్యాన్ని ఇస్తూ తమ చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గతంలో ఉన్న రేషన్ డీలర్లను, ఎండీయూ వాహనాలు తొలగించి, అధికార పార్టీ నేతలు తమకు అనుకూలమైన వారిని రేషన్ డీలర్లుగా పెట్టుకుని పౌరసరఫరాల పంపిణీకి శాసిస్తున్నారు. ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ నుంచి బియ్యం, చక్కెర, కందిపప్పు, జొన్నలు ఇస్తుంటే, డీలర్లు మాత్రం కేవలం బియ్యం, చక్కెర ఇస్తూ కందికప్పు మాత్రం తమకు అనుకూలమైన వ్యక్తులకు మాత్రమే ఇచ్చి, మిగిలిన వాటిని బయట వ్యాపారస్తులకు అమ్ముకుంటూ జేబులు నింపుకుంటున్నారు. రేషన్ కార్డుదారులు కందిపప్పు ఇవ్వమని అడిగితే స్టాకు రాలేదని, ఇష్టమొచ్చిన వారికి చెప్పుకోండని దురుసుగా మాట్లాడుతున్నారు. ఎండీయూ అపరేటర్లు మాత్రం పంపిణీ చేస్తామని చెబుతున్నా డీలర్లు మాత్రం మీరు వాహనాలను ఇంటి వద్దనే పెట్టుకోండి.. ఉన్నతాధికారులతో తాము మాట్లాడుకుంటామని చెబుతున్నట్లు సమాచారం. మీకు మాత్రం ప్రతి నెలా వేతనాలు అందుతాయని డీలర్లు చెప్పడంతో వారు కూడా వాహనాలను తమ ఇంటి వద్దే పెట్టుకుని ఇతర పనులను చేసుకుంటున్నారు.

నా దృష్టికి రాలేదు

ఎండీయూ ఆపరేటర్లకు ప్రతి నెలా రూ.21 వేలు వేతనం ప్రభుత్వం ఇస్తోంది. అందులో రూ.3 వేలు వాహనం కంతు కోసం కటింగ్ పోను రూ.18 వేలు ఎండీయూ ఆపరేటర్ల అకౌంట్లలో జమ అవుతోంది. ఎండీయూ ఆపరేటర్లు వాహనాల్లో రేషన్ పంపిణీ చేయడం లేదని ఇంతవరకు నా దృష్టికి రాలేదు.

– జరీనా, తహసీల్దార్, వడమాలపేట

బండ్లు ఎక్కడా తిరగడం లేదు



గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో ఇంటింటికీ వచ్చి ఎండీయూ ఆపరేటర్లు ఇచ్చేవాళ్లు. ఇప్పుడు మండలంలో ఆ బండ్లు ఎక్కడా తిరగడం లేదు. ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా రేషన్ డీలర్లు తూకాల్లో మోసం చేస్తున్నారు. తాము ఇచ్చిందే తీసుకోవాలని కసురుకుంటున్నట్టు మా దృష్టి కార్డుదారులు తెస్తున్నారు. కందిపప్పు కూడా స్వాహా చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. సక్రమంగా రేషన్ సరుకులు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– వడమాల లోకేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ, వడమాలపేట

పెట్రో ధరలను జీఎస్టీ పరిధిలోకి తేవాలి


కార్వేటినగరంలో నిరసన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ జిల్లా నాయకులు

కార్వేటినగరం: దేశవ్యాప్తంగా ఉన్న ఆటో కార్మికులకు కేంద్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి. పెట్రో ధరలను జీఎస్టీ పరిధిలోకి తేవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి విజయకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో శ్రీరంగరాజపురం, కార్వేటినగరం మండలాల ఆటో కార్మికులకు మండల నాయకుడు వసంతరాయులు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కోదండయ్య మాట్లాడుతూ, కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటుకు పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఆటో కార్మికులకు గత ప్రభుత్వం అమలు చేసిన వాహనమిత్ర పథకాన్ని కూటమి ప్రభుత్వం కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే ఆటో కార్మికులకు తక్కువ వడ్డీకి బ్యాంకు రుణాలు ఇప్పించి ఆదుకోవాలని కోరారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శదర్శులుగా అరుణ్‌కుమార్, దినకర్, రాజేష్, ప్రభు, భాషాబాయ్, పురుషోత్తం, శేఖర్ నియమితులయ్యారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు దాసరి చంద్ర, ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి రఘు, జీడీ నెల్లూరు ఏఐటీయూసీ నియోజవర్గ అధ్యక్ష, కార్యదర్శులు జయకుమార్, గోవిందస్వామి పలువురు పాల్గొన్నారు.

అంతర పంటలపై ఆసక్తి


కొబ్బరిలో అంతరపంటగా వేరుశనగ


మామిడిలో అంతర పంటగా వేరుశనగ, ఎర్రగడ్డలు


మామిడిలో అంతరపంటగా మిరప

కార్వేటినగరం: మెట్ట ప్రాంతంలో రైతులు అంతర పంటల సాగుపై మక్కువ చూపుతున్నారు. ఏటా అతివృష్టి లేదా అనావృష్టితో ఒక పంటకు నష్టం వాటిల్లినా మరో పంట ఆదుకుంటుందన్న ఆశతో ఖర్చులకు వెనకాడకుండా అంతర పంటలు సాగు చేస్తూ లాభాలు అర్జిస్తున్నారు. పెరుగుతున్న ఎరువులు, పురుగు మందుల ఖర్చు, సాగు పెట్టుబడులతో గిట్టుబాటు ధర లభించకపోవడంతో మరింత ఆదాయం కోసం వాణిజ్య పంటలతోపాటు అంతర పంటలపై మొగ్గు చూపుతున్నారు. మెట్ట ప్రాంతంలో 10 వేల హెక్టార్లలో రైతులు అంతర పంటలు సాగు చేస్తున్నారు.

అంతర పంటల్లో భాగంగా కొబ్బరి, కోకో, అరటి, వక్క, ఆయిల్‌పామ్ తోటల్లో వేరుశనగ, మొక్కజొన్న, మామిడిలో మొక్కజొన్న ఏకకాలంలో రెండు, మూడు రకాల కూరగాయలు సాగు చేస్తున్నారు. వాణిజ్య పంటల సాగులో పెట్టుబడులను అంతర పంటల నుంచి రైతులు సమకూర్చుకుంటున్నారు. దీని వల్ల కూలీల కొరతను అధిగమించడమే కాకుండా ఎరువులు, పురుగు మందులు వాడినప్పుడు ఖర్చు తగ్గించుకుంటున్నారు. తక్కువ నీటితో ఎక్కువ పంటలను పండించే వీలు కలుగుతోంది. ప్రభుత్వాలు కూడా అంతర పంటల వైపు రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. రైతులకు ప్రత్యేక రాయితీలు, రుణాలు అందించి అంతర పంటల సాగు పెరగడానికి కృషి చేయాలని విజ్ఞప్తి చేసున్నారు.

రాయితీలు ఇవ్వాలి



అంతర పంటలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు ఇవ్వాలి. వాణిజ్య పంటల్లో అంతర పంటలు వేసుకోవడానికి విత్తనాలు ఉచితంగా సరఫరా చేసి రైతులను ప్రోత్సహించాలి. అంతర పంటలు పండించడంతో సాగు ఖర్చులు తగ్గాయి.

– రమేష్, కట్టకిందపల్లి, పాలసముద్రం మండలం

రెండు పంటలతో ఆదాయం



ప్రస్తుతం వ్యవసాయంలో పెట్టుబడులు విపరీతంగా పెరిగాయి. కూలీలు గ్రామాల్లో దొరకడం లేదు. ఒకేసారి రెండు రకాల పంటలు పండించక పోతే గిట్టడం లేదు. అంతర పంటల సాగు కారణంగా ఖర్చులు తగ్గి, తగిన ఆదాయం కూడా వస్తోంది.

– వీరభద్ర, రైతు, గాంధీపురం, పెనుమూరు మండలం

చెత్త నుంచి సంపద తయారీపై ప్రత్యేక దృష్టి


చెత్త సేకరణ కేంద్రంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ

పాలసముద్రం: గ్రామాల్లో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, చెత్త నుంచి సంపద తయారీపై అధికారులు ప్రత్యేకదృష్టి సారించాలని ఎంపీడీఓ క్రిష్ణమహేష్ రెడ్డి ఆదేశించారు. శుక్రవారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయం, చెత్త సేకరణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. చెత్త నుంచి సంపద తయారు చేస్తే పంచాయతీకి ఆదాయం వస్తుందన్నారు. గ్రీన్ అంబాసిడర్లతో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను తరలించి, వర్మీ కంపోస్టు తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి మహేష్‌బాబు, మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, ఆరోగ్య సిబ్బంది, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

వేగం కంటే ప్రాణం మిన్న


మాట్లాడుతున్న సీఐ సురేంద్రనాయుడు

పుత్తూరు: వాహనాలు నడిపేటప్పుడు వేగం కన్నా ప్రాణం ఎంతో విలువైందని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని సీఐ కేబీ సురేంద్రనాయుడు అన్నారు. రహదారి భద్రతపై శుక్రవారం స్థానిక ఎస్‌ఆర్‌ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐ మాట్లాడారు. డ్రైవింగ్ సమయంలో రహదారి నియమాలను విధిగా పాటించాలన్నారు. ఇటీవల కాలంలో అమ్మాయిలు, మహిళలు వాహనాలు నడపడం పెరిగిందని, వాహనాలు నడిపే సమయంలో విధిగా హెల్మెట్, సీటు బెల్ట్ ధరించాలన్నారు. సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ బైక్ డ్రైవింగ్ చేయరాదన్నారు. లైసెన్సులు లేకున్నా, మద్యం సేవించి వాహనాలు నడిపినా పెద్ద మొత్తంలో జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.చంద్రమౌళి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి


రికార్డులు పరిశీలిస్తున్న వెంకటరమణ

పాలసముద్రం : మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల టెన్త్ విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని స్పెషలాఫీసర్ వెంకటరమణ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని అంగన్‌వాడీ కేంద్రం, వీఆర్ కుప్పం జెడ్పీ హైస్కూల్, పీహెచ్‌సీని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యాబోధన చేయాలన్నారు. వీఆర్ కుప్పం హైస్కూల్లో టెన్త్ విద్యార్థులను పైవిధంగా కోరారు. విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలంటే తొలి మెట్టు పదో తరగతిలో పాసవడమేన్నారు. టీచర్లు వెనుకబడి విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ పెట్టి చదివించాలని కోరారు. పీహెచ్‌సీ సిబ్బంది సమయ పాలన పాటిస్తూ రోగులకు వైద్య సేవలు అందివ్వాలన్నారు. అనంతరం వెంగళరాజుకుప్పం, పాలసముద్రం బీసీ బాలుర, బాలికల హాస్టళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓ గిరిజ, డాక్టర్ మోహన్‌క్రిష్ణ, సీహెచ్‌ఓ జ్ఞానశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు మోక్షం


బోరు డ్రిల్ చేయడానికి పూజ చేస్తున్న అధికారులు

శ్రీరంగరాజపురం: మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు, ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యను పరిష్కరించారు. ఎంపీపీ సరిత మండల పరిషత్ నిధుల నుంచి నిధులు మంజూరు చేసి కొత్తగా బోరు వేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్ మురళి, తహసీల్దార్ లోకనాథపిళ్లై, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

రైతులకు డిజిటల్ కార్డుల నమోదు



వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలంలోని రైతులందరూ డిజిటల్ గుర్తింపు కార్డుకు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి విజయ్‌కుమార్ కోరారు. శుక్రవారం ఎస్‌బీఆర్ పురంలో విశిష్ట డిజిటల్ గుర్తింపు కార్డు నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఏఓ మాట్లాడుతూ, ఈ కార్డు ఉంటే ప్రభుత్వ పథకాలు, సబ్సిడీ, పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ, ఇతర వ్యవసాయ సంబంధిత పథకాలు, సేవలు పొందవచ్చన్నారు.

చదువును మించిన సంపద లేదు


విద్యార్థులకు ఉచితంగా అందజేస్తున్న విద్యాసామగ్రి

శ్రీరంగరాజపురం : చదువును మించిన సంపద లేదని శతావధాని ఆముదాల మురళి అన్నారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ఆరిమాకులపల్లె జెడ్పీ హైస్కూల్లో తెలుగు సాహిత్యంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుతో పాటు సామాజిక దృక్పథాన్ని అలవరచుకోవాలన్నారు. అన్ని భాషల కంటే తెలుగు భాష మాట్లాడడం మధురంగా ఉంటుందన్నారు. తెలుగు భాషా పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. తెలుగు సాహిత్య సంస్కృతిక సమితి కోశాధికారి, సంఘ సంస్కర్త పైనేని మురళి తన జన్మదిన పురస్కరించుకుని విద్యార్థులకు ఉచితంగా తెలుగు నింఘటువు, పోటీ పరీక్ష పుస్తకాలు మొదలైన వాటిని పంపిణీ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. సమితి అధ్యక్షులు తులసీనాథం, ప్రధానోపాధ్యాయులు రమేష్, సర్పంచ్ లక్ష్మమ్మ, దామునాయుడు, టీచర్లు విజేంద్రనాయుడు, హిమాచలపతి, సరోజ, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి సహకరించండి : ఎంపీపీ


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ దీప

నింద్ర: మండలాభివృద్ధిలో అధికారులు కీలకపాత్ర పోషించాలని ఎంపీపీ దీప అన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించి ఎంపీపీ మాట్లాడారు. ప్రజా సమస్యలపై అధికారులు ఎప్పటికప్పుడు స్పందించాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు మంజూరులో స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చి అర్హత కలిగిన వారిని మాత్రమే ఎంపిక చేయాలని, అయితే తమకు సమాచారం ఇవ్వకుండా చేస్తున్నారని సభ్యులు మండిపడ్డారు. వైద్యాధికారి నిరోషా మాట్లాడుతూ, మండలంలో కుక్క కాటుకు 90 మందికి యాంటీ రేబీస్ టీకాలు వేసినట్లు తెలిపారు. సీడీపీఓ దృష్టికి పలు సమస్యలు తెద్దామని భావిస్తే ఆమె గైర్హాజరయ్యారని సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. పంచాయతీల్లో పారిశుధ్యం, వీధిదీపాలు, తాగునీటి సమస్యలు లేకుండా చూడాలని ఈఓఆర్డీ లక్ష్మీపతి కోరారు. సమావేశంలో వైస్ ఎంపీపీ శుభా, దుర్గాదేవి, ఎంపీడీఓ శివప్రసాద్‌వర్మ, తహసీల్దార్ శేషగిరిరావు, హౌసింగ్ ఏఈ శ్రీధర్‌రాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివరామకృష్ణశర్మ, ఇరిగేషన్ ఏఈ లోకేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ శ్రీధర్‌రాజు, పీఆర్ ఏఈ వీరభద్రం, కో–ఆప్షన్ సభ్యులు అనిల్, ఎంపీటీసీలు, సర్పంచులు, సచివాలయ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.